మకరముఖం

బస్సు దిగి చేతిలో ఉన్న చిన్న సూట్‌కేస్‌ను కిందపెట్టి, జేబురుమాలుతో ముఖం తుడుచుకుంటూ అటూ ఇటూ చూశాను. నన్ను దింపిన బస్సు అల్లంత దూరంలో వెళ్తుండటం తప్ప మరెవ్వరూ కనిపించలేదు. రోడ్డుకు ఎడంగా రెండు కర్రగుంజలకు బిగించిన ఇనుపరేకు మీద "వెంకటాపురం 2 కి.మీ." అన్న అక్షరాలు చూస్తూ కొద్దిసేపు నిలబడి, చేతి వాచీ చూసుకున్నాను. పది గంటలు కావస్తోంది. దళితుల మీద దాడి చేస్తున్న భూస్వామి అహంకారంలా ఎండ తీవ్రంగా, క్రూరంగా ఉంది.

నేను నిల్చున్న చోటు నుంచి చూస్తే ఎర్రటి మట్టి రోడ్డు ఆ ఎండలో మరింత ఎర్రగా మెరుస్తూ కనిపిస్తూ ఉంది. రోడ్డుకు ఏ వైపునా ఒక చిన్నపాటి చెట్టు కూడా కనిపించటం లేదు. కానీ, రోడ్డు అంతమయ్యే చోటునుంచి నాలుగైదు గుబురు చెట్లూ, ఆ చెట్ల సందుల్లోంచి రెండు మూడు తెల్లటి మిద్దెలూ కనిపిస్తూ 'అక్కడో ఊరు ఉంది' అన్న నిశ్చయానికొచ్చి సూట్‌కేస్ చేతబట్టుకొని మెల్లగా నడక ప్రారంభించాను.

రోడ్డుకు రెండు వైపులా ఎర్రటి పొలాలు, ఒక్క పిచ్చిమొక్క కూడా లేకుండా దైన్యంగా కనిపిస్తున్నాయి. దాహం కోసం నోరు తెరచి ఆకాశం వేపు ఆబగా, జాలిగా చూస్తున్న ఆ పొలాల బీటల్లో నా జీవిత రేఖల్ని దర్శిస్తూ అడుగులు వేస్తున్నాను.

వెంకటాపురం ఎలిమెంటరీ స్కూల్లో 'సెకండరీ గ్రేడ్ అసిస్టెంట్'గా నన్ను నియమిస్తూ 'పోస్టింగ్ ఆర్డర్' మూడు రోజుల క్రితం వచ్చింది. బి.ఇడి. పూర్తి చేసిన తర్వాత రెండేళ్ళకు వచ్చిన ఉద్యోగం ఇది. జిల్లా పరిషత్తువాళ్ళు నిర్వహించిన రాతమూలక, మౌఖిక పరీక్షల్లో సెలెక్ట్ అయినందువల్ల నాకీ ఉద్యోగం వచ్చింది.

"రిజర్వేషన్ కోటాలో ఉద్యోగం కొట్టేశావోయ్! అదృష్టం అంటే మీ 'ఎస్సీ' గాళ్ళదే" అంటూ మా ఊళ్ళో ఒక అగ్రవర్ణ మిత్రుడు ఎద్దేవా చేస్తే కంపరం పుట్టింది నాకు.

"అంటే, నా ప్రతిభవల్ల నాకీ ఉద్యోగం రాలేదంటావా" అని నిలదీశాను ఆ అగ్రవర్ణ మిత్రుడిని.

"ప్రతిభ నీది కాదోయ్! నీ కులానిది" అంటూ అసూయ విషంలా కక్కేశాడతను.

"మా కులంలో పుట్టినవాళ్ళకు ప్రతిభ లేదంటావ్! అయితే, అగ్రవర్ణంలో పుట్టిన నీ ప్రతిభకు ఇంతకాలంగా ఎందుకు ఉద్యోగం రాలేదంటావ్" అని సీరియస్‌గా అడిగాను నేను.

"ఎందుకేమిటీ? మీ రిజర్వేషన్ కోటగాళ్ళ వల్లనే..." అని అతనంటూంటే లాగి చెంపకాయ కొట్టాలనిపించింది నాకు.

ఎస్.సి. కులంలో నేను పుట్టడమే ఇంతకూ కారణమని అతనంటూంటే మనసు కుతకుతా ఉడికిపోయింది.

"నిన్ను చూసి జాలిపడటం తప్ప నేనేమి చేయలేను. నీ అసమర్థతను కప్పిపుచ్చుకోటానికి నెపం ఎదుటివాడి కులం మీద మోపుతున్నావ్ – అంతే" అని దులిపేసి దూరంగా వచ్చేశాను.

ఆ రోజంతా నాకు బాధగానే ఉంది. ఆ మిత్రుడన్న మాటలు నేను కొత్తగా వింటున్నదేమీ కావు.

"స్వతంత్రం వచ్చి ఇన్నేళ్ళయింది. ఇంకా రిజర్వేషన్లు కొనసాగిస్తే ప్రతిభగల వాళ్ళంతా మట్టిగొట్టుకుపోతారు" అన్న మాటల్ని నేను కాలేజీ చదివే రోజుల్నుంచి వింటూనే ఉన్నాను.

"ఎస్.సి., ఎస్.టి లాంటి కులాలకు ప్రభుత్వం ఎన్నో విద్యావకాశాలు కల్పిస్తోంది. ఉచిత చదువు, ఉచిత భోజనం, పుస్తకాలూ, బట్టలూ – ఇదంతా చాలదా వాళ్ళ అభివృద్ధికి? ఈ అవకాశాలను ఉపయోగించుకొని వాళ్లు పోటీ పడాలి. అంతేగాని, కులం పేరుతో ఏ ప్రతిభా లేకుండా ఉద్యోగాలు ఇంకా కొట్టేయాలనుకోటం సాంఘిక ద్రోహం" అని మా లెక్చరరే ఒకాయన ఉపన్యాసం దంచేస్తూంటే మండుకొచ్చేది నాకు.

ఇలాంటి మకిలి మనుష్యుల్ని నా విద్యార్థి జీవితంలో నేను ఎందర్నో చూశాను. ఎన్నో సందర్భాల్లో ఇలాంటి వాళ్ళ అవహేళనతో కూడిన వ్యంగ్యపు విసురుల్ని ఎన్నిట్నో ఎదుర్కొన్నాను.

ఊరికి ఎడంగా ముప్పయ్ గుడిసెలున్న హరిజనవాడలో ఒక పాత గుడిసెలో ఇరవైమూడేళ్ళ కిందట నేను పుట్టాను. నా బాల్యమంతా కష్టాలతోనూ, అవమానాలతోనూ గడచిపోయింది. ఈ మాట చెప్పుకోటానికి నేనీనాడు దిగులుపడటం లేదు. రైతుల ఇళ్ళలో పేడా, కసవూ ఊడ్చి గంజు ఎత్తిపోసి, బండచాకిరీ చేసే జీతగాళ్ళ కుటుంబాల్లో పుట్టిన ఎవరేనా కష్టాలతోనే జన్మ ఎత్తుతారు. మా నాన్న ఒక పెద్ద రైతు ఇంట్లో ఒక చిన్న జీతగాడు. మా తాత కూడా ఒక జీతగాడేనట. విచారించగా మా పూర్వీకులంతా జీతగాళ్ళుగాక మరేమవుతారు? నాకు ఆరేళ్ళ వయసున్నప్పుడు మా ఊరి ఎలిమెంటరీ స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్నప్పుడు మా నాన్న చనిపోయాడు. ఆ చనిపోవటమూ మామూలుగా అందరూ చనిపోయినట్టు కాదు. కపిల తోలుతూ, మోకు చిల్ల ఊడి, మోకుతో పాటు బావిలోకి ఎగిరిపడి, తలపగిలి, శరీరం ముక్కలై చాలా దారుణంగా చనిపోయాడు. ఇది గుర్తుకొస్తే ఇప్పటికీ నా శరీరం గజగజా వణికిపోతుంది.

మా నాన్న చనిపోయేటప్పటికి మా తాత ఇంకా ఉన్నాడు. మా అమ్మా నేనూ, నా తమ్ముడూ. చెల్లెలూ – ఇదీ మా కుటుంబం! ఈ చిన్న కుటుంబం బతకటమే ఎంతో కష్టమయ్యేది. మా అమ్మ అన్ని పనులూ చేసేది. కూలీనాలీ చేసేది. పాచిపనులు రైతుల ఇళ్ళలో నడుం ఎత్తకుండా చేసేది. చెప్పులు కుట్టేది. గొడ్డలి భుజం మీద పెట్టుకొని వెళ్ళి కంపలు చీల్చేది. తానొక్కతే కుటుంబాన్నంతా వెళ్ళదీసేది. నా చిన్న చదువును మానిపించి, ఏ రైతు ఇంట్లోనో గొడ్ల వెంబడి పంపిద్దామని మా తాత అంటే, మా అమ్మ బోరున ఏడ్వటం ఇప్పటికీ నాకు గుర్తు. మా స్కూల్ టీచర్ దయానందంగారని ఒకాయన ఇప్పటికీ నాకు బాగా జ్ఞాపకం. ఆయన క్రైస్తవుడు. పేరుకు తగ్గ మనిషి. "మీ వాణ్ణి చదువు మాన్పించకమ్మా ఏ రోజులెట్లుంటాయో ఏమో! వీడి తెలివికి చదువు అబ్బుతుంది. నేను చూసుకుంటాను" అని ఆయన మా అమ్మతో అన్నప్పుడు ఆమె ఆయన పాదాలను తన చేతుల్తో తాకటం ఇప్పటికీ నా కళ్ళముందున్నట్లే ఉంది. నేను నాలుగో తరగతిలో ఉన్నప్పుడు దయానందం టీచర్ అంబేద్కర్ పాఠం బోధిస్తూ "నాయనా! ఈ దేశంలో మతాలు మాసిపోవచ్చునేమో గాని, కులాలు మాత్రం ఎప్పటికీ నిలిచే ఉంటాయి! అంబేద్కర్ అంతటివాడు ఈ కుల వ్యవస్థను రోసి బౌద్ధమతంలో చేరిపోయాడు" అన్న మాటలు నన్ను ఈనాటికీ వెంటాడుతున్నట్లే ఉన్నాయి.

మా ఊళ్ళో హైస్కూల్ లేదు. నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న హైస్కూల్లో – ఎస్.సి. హాస్టల్లో చేరి – చదువుకున్నాను నేను. ఈ పుణ్యమంతా దయానందం టీచర్‌దే. మా హాస్టల్ కుర్రాళ్ళంటే మా హైస్కూల్ టీచర్లందరికీ ఎంత అలుసో! మాలో చాలామందికి చదువు సరిగ్గా రాకపోవటానికీ, మా తరతరాల సాంస్కృతిక నేపథ్యానికి సంబంధం ఉందని గ్రహించకుండా తిండి కోసమే మేము వచ్చినట్లు ఎన్నెన్ని మాటలు అనేవాళ్ళో! నేను చదివిన ఆ స్కూల్లో ఒక సైన్స్ మాస్టారు మాత్రం మేమంటే ఎంతో ఇష్టమూ, దయా చూపేవారు. "రాజకీయాలకు నిధులుగా మాత్రమే మిమ్మల్ని ఉపయోగించుకునే ఈ దేశంలో సాంస్కృతిక సమానత్వం ఎప్పటికి సాధ్యమవుతుంది." అని ఆయన నిట్టూర్చేవారు. "కేవలం అరుపులు అరచి ఎంతకాలం మభ్యపెట్టగలరు" అన్న ఆయన ప్రశ్న నన్ను ఉద్విగ్నుణ్ణి చేస్తూండేది.

"మీ కేమిరా! భవిష్యత్తంతా మీదే. ఈ దేశ జీవన స్రవంతిలో మీకూ సమాన ప్రాతినిధ్యం లభించింది" అని నేను చదివిన కాలేజీలో హిస్టరీ లెక్చరర్ పదే పదే జోక్‌లా మాటలు పేల్చేస్తూంటే, "వీళ్ళెక్కడుండి మాట్లాడుతున్నారు" అనిపించేది నాకు.

ఆలోచనలతో తల నేలకేసి అడుగులు వేస్తూన్న నా ఎదుట ఎవరో నిల్చున్నట్లయి తలెత్తి చూశాను. ఎదురుగా అరవై ఏళ్ళ మనిషి భుజం మీద పాత దుప్పటి, చేతిలో కర్ర, వంగొని ఉన్నాడు. నిటారుగా నిల్చోలేక.

"యావూర్నాయనా" అనడిగాడు నా ఆకారం కేసి చూస్తూ.

"చాలా దూరంలే తాతా! వెంకటాపురమేనా మీది" అనడిగాను.

అవునన్నట్లు తలాడించి, "ఎవురింటికి" అనడిగాడు.

"ఎవరింటికీ కాదు తాతా! మీ ఊరి ఎలిమెంటరీ స్కూల్‌కు అయ్యవార్ని" అన్నాను.

"అట్లనా! అయితే, ఎల్లెల్లు" అంటూ నన్ను అనుమానంగా చూస్తూ ముందుకు నడచిపోయాడతను.

అయ్యవార్ని అనగానే నాతో మాట్లాడటానికి ఇంకేముందిలే అనుకున్నాడేమో!

డొంకలాంటి దారిగుండా పదినిమిషాలు నడిచి గ్రామం మొదట్లోకి చేరుకున్నాను. ఎండ మరింత తీవ్రంగా కాలుస్తోంది.

నాలుగు అడుగులు వేసేసరికి అటూ ఇటూ నడుస్తూన్న జనం – ఇంటి ముంగిళ్ళలో కూచున్న ఆడవాళ్ళు – దారికి అడ్డంగా పడుకున్న రెండు ఎనుములూ – వారి మధ్య నిల్చుని నన్ను ఆసక్తిగా చూస్తున్న కుక్కలూ – ఇళ్ళలోంచి వినిపిస్తున్న రేడియో సంగీతం – ఒక బీడీ బంకు ముందు నిల్చున్న మనుషుల మాటల రొద, ఊరి సందడిని గుర్తింపజేస్తున్నాయి.

బీడీ బంకు పక్కన ఒక చిన్న పాక. బహుశా హోటల్ లాంటిది కావచ్చు. పాకకానుకొనే ఒక వేపచెట్టు. పాక ముందు చెట్టు నీడలో రెండు పొడవాటి బెంచీలు, బెంచీల మీద కూచుని కాఫీ తాగుతున్న ఒకరిద్దరూ.

ఊరికి కొత్త మనిషిని కాబట్టి అక్కడున్న వాళ్ళు నన్ను జాగ్రత్తగా, మౌనంగా చూస్తున్నట్టుండిపోయారు.

నేను పాకదాకా నడిచి, ఖాళీగా ఉన్న బెంచీ మీద సూట్‌కేస్ పెట్టి కూచున్నాను. అప్పుడు పలకరించాడు ఎదురుగా కూచున్న మనిషి నన్ను "ఏ ఊరండీ" అంటూ, తెల్లటి బట్టలతో, బాగా చదువుకున్నవాడిలా కనిపించాడతను. నాకంటే అయిదారేళ్ళు ఎక్కువ వయసుండొచ్చు.

నన్ను పరిచయం చేసుకున్నాను నాలుగు మాటలతో.

"ఓహో! మీరేనా, మా మండలం ఆఫీసులో మొన్ననే చెప్పినారులెండి. మీ ఊరికి ఒక టీచర్ని వేసినామని. చాలా దూరం నుండి వచ్చినట్లుండారే" అన్నాడతను.

నేను చిన్నగా నవ్వాను.

"మీకిదే ఫస్ట్ అపాయింట్‌మెంట్ అనుకుంటాను. చిన్న వయసులోనే ఉద్యోగం సంపాదించుకున్నారు" అన్నాడు అభినందిస్తున్నట్లు.

ఆ తర్వాత అతనే హోటల్‌లోంచి ఒక చెంబుడు నీళ్ళు తెప్పించాడు. ఆ నీళ్ళతో ముఖం కడుక్కున్నాను.

"టిఫిన్ ఏమైనా తీసుకుంటారా?" అనడిగాడు.

"ఉదయం టౌన్‌లో తీసుకునే బయల్దేరాను. కాఫీ చాలు" అన్నాను. కాఫీ తాగుతూ "మీరేం చేస్తుంటారు" అనడిగాను.

"ఏముంది? వ్యవసాయమే. ఇంటర్ ఫేలయి ఊళ్లోనే ఉండిపోయాను" అన్నాడు నవ్వుతూ.

ఇంతలో అక్కడికి ఓ వ్యక్తి గబగబా వచ్చి తలకు చుట్టుకున్న తువ్వాలును తీసి విదిలించి భుజం మీద వేసుకుని, పాకకు ఓ పక్కగా మునికాళ్ళ మీద కూచున్నాడు. ఆ మనిషికి యాభై ఏళ్ళుండవచ్చు. సన్నగా, నల్లగా, పండుబారిన నేరేడుపండులా ఉన్నాడు. మాసిన బనియనూ, మోకాళ్ళదాకా చాలీచాలని పంచెతో, కట్టెకు ఒక పాత పేపరు చుట్టినట్టున్నాడు. అతడు కూచునే, తన పుల్లలాంటి చేతిని చాచి, పాక గుంజకు బోర్లించిన ఒక సత్తు గ్లాసును తీసి పట్టుకుని పాకలోకి వంగి చూస్తూ "సామీ" అని పిలిచాడు. రెండు నిమిషాల తర్వాత పాక యజమాని వచ్చి ఆ గ్లాసులోకి ఇన్ని నీళ్ళు పోసి వెళ్లాడు. ఆ నీళ్ళు గుటగుటా తాగేసి అలానే పట్టుకుని కూచున్నాడతను. మరో రెండు నిమిషాల్లో ఆ గ్లాసులోకి కాఫీ పోస్తే, దాన్ని నెమ్మదిగా నోటితో ఊపుకుంటూ తాగుతూండి పోయాడతను. కాఫీ తాగిన తర్వాత మళ్ళీ నీళ్ళు పోయించుకుని గ్లాసు శుభ్రం చేసి పాక గుంజకు దానిని బోర్లించి, పంచె కొసను విప్పి కొంత చిల్లర అక్కడ ఉంచి ఏదో పని ఉన్నవానిలా చకచకా వెళ్ళిపోయాడు.

అతనెవరో, ఎందుకలా చేశాడో అర్థమై నా మనసంతా దిగులుతో ఆర్ద్రమయి పోయింది. ఈ బెంచీ మీద కూచుని కాఫీ తాగిన నేనెవరో తెలిస్తే నన్ను కూడా ఆ సత్తుగ్లాసే వరిస్తుందా అనిపించి ఏదో కలవరం క్షణకాలం నన్ను కప్పుకుంది.

నేను తాగిన కాఫీకి డబ్బులు అతనివ్వబోతూంటే, బలవంతంగా వారించి నేనే చెల్లించాను.

"మా ఎలిమెంటరీ స్కూల్ చూపిస్తారా?" అతన్ని అడుగుతూ బెంచీ మీద నుంచి లేచి సూట్‌కేస్ పట్టుకుని నిల్చున్నాను.

"ఆ దారిలోనే మా ఇల్లు. రండి" అంటూ అతను నడువగా నేను అనుసరించాను.

నడుస్తూ వాళ్ళ ఊరి గురించి ఏదో చెబుతున్నాడతను. రెండు వందల గడపలు మించని చాలా చిన్న ఊరట. రెండేళ్ళుగా సరిగా పంటలు లేవట. బావుల్లో అసలు నీళ్ళు లేవు. కూలీనాలీ మీద ఆధారపడే కుటుంబాలే ఎక్కువ. ఆర్నెల్ల క్రితం ఒక పెద్ద వర్షం వచ్చిందట. ఆ వర్షానికి ఎలిమెంటరీ స్కూల్ బిల్డింగ్ కప్పు కూలిపోయిందట. అదెప్పటిదో చాలా పాత బిల్డింగట. అప్పట్నించి స్కూల్‌ను ఆంజనేయస్వామి గుడిలో నడుపుతున్నారట. స్కూల్ పుట్టినప్పట్నుంచి రెండో టీచర్‌ను వేస్తామని సంవత్సరాలుగా

అధికారులు చెబుతున్నారట. "ఇప్పటికీ మీరే తొలిసారిగా వస్తున్న రెండో టీచర్" అంటూ విషయాలు దారి పొడవునా చెప్పుకొచ్చాడతను.

ఆంజనేయస్వామి గుడిలో స్కూల్ అన్న మాట వినిపించగానే చిన్న సంచలనం లాంటిది కలిగి ఒక్క నిమిషం నా నడక కుంటుపడింది. మా ఊరి ఆంజనేయస్వామి గుడి గుర్తుకొచ్చింది నాకు. మా ఊరి ఆంజనేయస్వామికి ఆ చుట్టుపట్ల పల్లెల్లో ఎంతో కీర్తి. ఎప్పుడూ ఎవరో ఒకరు వచ్చి ఆకుపూజ చేయించే వారు స్వామికి.

నా చిన్నతనంలో ఆ గుడి ముందు మూగేవాళ్ళం బడి పిల్లలం. నా తోటి పిల్లలు గుడిలోకి వెళ్తే నేను బిక్కు బిక్కుమంటూ బయటే ఉండి పోయేవాణ్ణి. కొబ్బరి చిప్పలు కొట్టి ముక్కలు చేసి, దూరం నుంచే నా చేతిల్లోకి విసిరేవాళ్ళు భక్తులు.

కొంత వయసొచ్చింతర్వాత మా చేతి స్పర్శ పొందని ఆ దేవుడే అస్పృశ్యుడు అనుకొని కసిగా నవ్వుకొనేవాణ్ణి నేను.

దారిలో ఒకరిద్దరు ఎదురైతే "కొత్తగా వచ్చిన టీచర్" అంటూ నన్ను మాట మాత్రంగా పరిచయం చేశాడతను.

ఒక సందు మలుపు తిరిగిన తర్వాత అతను ఆగి ఒక పాత బిల్డింగ్‌కేసి చూస్తూ "ఇదే కప్పు కూలిపోయిన మీ ఎలిమెంటరీ స్కూల్. ఎప్పటికి రిపేరు చేయిస్తారో ఏమో" అంటూ ఒక పాత భవనాన్ని నాకు చూపించాడు.

ఊరంతా చాలా ఇరుకు సందులు, దారి నిండా గతుకులు – చిన్న చిన్న రాళ్ళు. అతని పక్కనే నడుస్తున్నాను నేను.

ఎండ చాలా తీవ్రంగా కాస్తోంది.

ఒక పెద్ద వీధిలో నడుస్తున్నాం మేము. ఆ వీధి మలుపు తిరగ్గానే విశాలమైన బయలు ప్రదేశంలో కనిపించింది ఆంజనేయ స్వామి గుడి.

"అదే గుడి – అదే స్కూలు" అంటూ చూపించాడతడు.

ఆ గుడిని చూసి విస్తుపోతూ అలాగే నిల్చుండిపోయాను నేను. గుడిలో అరుగుల మీద నీడలో గుంపులు గుంపులుగా పిల్లలు కూర్చునున్నారు. వాళ్ళందరూ స్పష్టంగా కనిపిస్తున్నారు నాకు.

వాళ్ళకు ఎదురుగా గుడి ముందు ఎర్రటి ఎండలో, కసాయి ఎండలో, ఒకతను నిల్చుని చేతులు ఊపుతూ ఏదో గట్టిగా చెబుతున్నాడు. అతని నెత్తిమీద ఒక

తువ్వాలు తుండు మాత్రం అటూ ఇటూ వేలాడుతోంది. అతని చెంపల మీద నుంచి ధారాపాతంగా చెమట కారుతూంది. అతని కాళ్ళ వెనుక ఒక చిన్న స్టూల్ నిస్సహాయంగా ముడుచుకుని కూచున్నట్టుగా ఉంది.

పల్చటి బట్టల్లో నిటారుగా నిలబడ్డ అతను పంచాగ్ని మధ్యంలో కఠోర దీక్ష వహించి తపస్సు చేస్తున్నవానిలా ఉన్నాడు. భూమి లోంచి ఏ ప్రమేయమూ లేకుండా మొలుచుకు వచ్చి, ఎన్నాళ్ళు గానో నీళ్ళు లేక ఎండిపోయిన పాత తుమ్మచెట్టులా అతనెంతో దయనీయంగా కనిపించాడు నాకు.

నేను నిలిచిపోవటం చూసి నా పక్క నడుస్తున్న అతను కూడా నిలబడిపోయి నా ముఖం వేపు చూస్తూ "ఈ గుడిలోనే మీరు పాఠాలు చెప్పాలి సార్" అన్నాడు. "అది సరే. గుడి ముందు నిల్చున్న ఆయనెవరండీ" అన్నాను నేను ఆశ్చర్యం వ్యక్తమయ్యేలా. "అతను మీ సహోపాధ్యాయుడండీ ఈ స్కూల్‌కు వచ్చి సంవత్సరమయింది" అన్నాడతను. ఆ మాత్రం స్ఫురించలేదా అన్న స్వరంతో.

"అదేమిటి, ఆయన ఎండలో నిల్చుని పాఠాలు చెబుతున్నారే" అన్నాను. దాదాపు వణుకుతున్న కంఠంతో.

"అతను హరిజనుడండీ హరిజనుడు. తప్పదుమరి."

అతి సాధారణమైన విషయంలా ఎంతో అలవోకగా అతను చెబుతూంటే నా నాభిలో మంట రగిలి, గుండెల్ని ఎగదన్ని శరీరం దహించిపోతున్నట్టుగా అలాగే కాలుతూ కాలుతూ నిల్చుండిపోయాను నేను. కొద్ది క్షణాల తర్వాత సంభాళించుకొని, అతని ముఖంలోకి నిశ్చలంగా చూస్తూ "నేను కూడా హరిజనుణ్ణే" అన్నాను దృఢంగా.

❖ ఇండియాటుడే, వార్షిక సంచిక, 1995